# ఎన్నడైనా

జి. వి. ఆర్. కె. శర్మ
బోష్టన్ , మాసచుసెట్స్

నిర్గుణబ్రహ్మమైన నీకు రూపకల్పన చేసి
రాగద్వేషాల రంగులు పూసి, ఆగ్రహానుగ్రహాలంటగట్టి
రాజేసుకున్న దుర్మత వైశ్వానర జ్వాలావళి
ఎన్నడైనా సమసేనా?

శిలప్రాయుడవైన నీ చింతనలో మునిగి
కరుణామయుడవనీ, కంటినీరు తుడుస్తావనీ
కలలు కనే మా వ్యధార్త్తజీవనకథాసరళి
ఎన్నడైనా బాగుపడేనా?

శ్రీమంతుడవని నిన్ను నిత్యమూ తలచి
నామసంకీర్తన చేసి, నానా పూజలు సలిపి
సిరులనే ఆశించే మా ఘనీభూతధనైకతత్పరత
ఎన్నడైనా వదిలేనా?

అవసరమైనప్పుడల్లా అవతరిస్తావనీ
ఆర్తి తీరుస్తావనీ, అభయవరదాయకుడవనీ
అపోహపడే మా అచంచల మూఢవిశ్వాసం
ఎన్నడైనా సడలేనా?

వర్గరహితసహజీవనమే స్వర్గతుల్యమనీ
అపేక్షారహిత కార్యాచరణమే తపస్సదృశమనీ
వైకల్యరహిత మనఃప్రవృత్తే కైవల్యపదమనీ
ఎన్నడైనా తెలిసేనా?

మంచిని పెంచేటందుకు మంత్రాలు, తంత్రాలు ఎందుకు?
లోని కుళ్లు కడిగేటందుకు గుళ్లు, గురువరులు ఎందుకు?
నువ్వూ, నేనూ ఒకటైతే ఆత్మెందుకు? పరమాత్మెందుకు?
అని ఎన్నడైనా తోచేనా?